ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 20.0
ANDHRAJYOTHY
3

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
బుధవారం 24 జనవరి 2024



జడ్చర్ల ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద లంచం ఘటనపై విచారిస్తున్న అధికారులు

ఎక్సైజ్‌లో ప్రక్షాళన జరిగేనా?

- ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారులు
- అవినీతిమయంగా మారిన శాఖ
- చేతులు తడపనిదే ముందుకు కదలని ఫైళ్లు

జడ్చర్ల, జనవరి 23: జడ్చర్ల నియోజకవర్గంలో ఎక్సైజ్ శాఖలో ప్రక్షాళన జరిగేనా? అన్న సందేహం వెలువడుతోంది. ఏళ్ల తరబడి పాతుకపోయిన అధికారులతో లంచం ఇవ్వనిదే పనులు జరగడం లేదని తెలుస్తోంది. నియోజకవర్గంలో టీఎఫ్‌టీ లైసెన్స్‌లు పొందాలన్నా, మందు కల్లు విక్రయించాలన్నా, బెల్ట్‌షాప్‌లు నిర్వహించుకోవాలన్నా అధికారుల చేతులు తడపాల్సిందేనన్న చర్చ జరుగుతోంది. టీఎఫ్‌టీ లైసెన్స్‌ల జారీ కోసం జడ్చర్ల ఎక్సైజ్ సీఐ బాలోజీనాయక్ సోమవారం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం అందుకు అద్దం పడుతోంది.

ప్రతీ నెల మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే..

నియోజకవర్గంలో మద్యం దుకాణదారులు ఎక్సైజ్ అధికారులకు ప్రతీ నెల మామూళ్లు ఇచ్చుకోవాల్సిందేనని, అదనంగా అప్పుడప్పుడు ఒకటో, రెండో ఫుల్ బాటల్స్ సైతం సమర్పించుకోవాల్సిందేనని ఆరోపణలు వస్తున్నాయి. ఆమ్యామ్యాలు ఇస్తేనే పనులు జరుగుతాయని చెబుతున్న ఈ శాఖలో కొన్ని అంశాలు మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. తమకు పనులు జరిగితే చాలు అన్న ధోరణితో ఉన్న వారి విషయాలు వెలుగులోకి రావడం లేదు. టీఎఫ్‌టీ లైసెన్స్‌ల జారీకి రూ.65 వేలు లంచం తీసుకుంటూ జడ్చర్ల ఎక్సైజ్ సీఐ బాలోజీనాయక్ ఏసీబీ అధికారులు తాజాగా పట్టుబడడంతో ఈ శాఖ అవినీతి ఒక్క సారిగా వెలుగులోకి వచ్చింది. టీఎఫ్‌టీ లైసెన్స్‌లు, కల్లు దుకాణాలకు అనుమతులు ఇచ్చేందుకు విధులను వ్యాపారంలా మార్చేశారన్న అపవాదును మూటకట్టుకుంది. గత డిసెంబరులో జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల సందర్భంగా కేవలం జడ్చర్ల మండలంలోనే సుమారు 70కిపైగా బెల్ట్‌షాప్‌ల నిర్వాహకులపై కేసులు నమోదవడం గమనార్హం. ఈత, తాటి చెట్లు అతి తక్కువగా ఉన్న గ్రామాలలో కల్లు విక్రయాలు మద్యం దుకాణాల మాదిరిగానే జరుగుతున్నాయి.

ఒక్కొక్కరికి ఒక్కో ప్యాకేజీ

ఎక్సైజ్ స్టేషన్‌లో ఫైల్ కదలాలంటే సీఐ నుంచి మొదలుకుని కింది స్థాయి సిబ్బంది వరకు చేతులు తడపాల్సిందే. ఒక్కొక్కరికి ఒక్కో ప్యాకేజీని అందించాల్సి ఉంటుంది. జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో టీఎఫ్‌టీ లైసెన్స్ జారీ అంశంలో సీఐకి ఎంత ముట్టచెప్పారో.. అంతకు రెట్టింపు తనకు ఇవ్వాలంటూ ఓ ఎస్ఐ హుకుం జారీ చేసినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. సీఐ పరిధిలో మండలాలు అధికంగా ఉంటాయని, ఎస్ఐ పరిధిలో కేవలం ఒకటి, రెండు మండలాలు మాత్రమే ఉంటాయని, అందుకు రెట్టింపుగా ఇవ్వాల్సిందే అంటూ టీఎఫ్‌టీ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న కల్లుగీత కార్మికులను సదరు ఎస్ఐ దబాయించినట్లుగా సమాచారం.

ఎమ్మెల్యే నిర్ణయం అమలయ్యేనా?

భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామానికి చెందిన తిరుపతయ్య గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీహరిగౌడ్‌లు టీఎఫ్‌టీ లైసెన్స్‌ల కోసం వెళ్లగా ఎక్సైజ్ సీఐ బాలోజీనాయక్ లంచం డిమాండ్ చేశారు. వారు ఏసీబీని ఆశ్రయించడంతో.. రూ.65 వేలు తీసుకుంటూ ఏసీబీకి బాలోజీ నాయక్ పట్టుబడ్డాడు. బాలోజీనాయక్‌పై కొన్నాళ్లుగా అవినీతి ఆరోపణలు అధికంగా వచ్చాయి. అయితే ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మితిమీరాయన్న ఆరోపణలు ఉన్నాయి. జడ్చర్ల నియోజకవర్గంలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి బెల్ట్‌షాపులు ఉండొద్దని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కాగా, బెల్ట్‌షాపుల నిర్వహణ అంశంలో సివిల్ పోలీసులతో పాటు ఎక్సైజ్ శాఖ అధికారులు తమ వంతు విధులు నిర్వహిస్తేనే ఆ నిర్ణయం సక్సెస్ అవుతుందని, ఈ అంశంలో ఎక్సైజ్ అధికారుల పనితీరు ఎలా ఉంటుందోనని ప్రస్తుతం చర్చ సాగుతోంది.

ఊడ్చే మిషన్ ఉఫ్..

- వనపర్తిలో పని చేయకుండానే దుమ్ముపట్టిపోతున్న స్వీపింగ్ మిషన్
- రూ. 65లక్షలతో 2020లో కొనుగోలు
- ప్రారంభం నుంచే రిపేర్లు.. దహనం చేసిన అగంతకులు
- నిప్పు పెట్టి ఏడాదవుతున్నా.. తెలియని కారణాలు
- ఇప్పటికీ వినియోగంలోకి రాని వాహనం



దహనం అవుతున్న స్వీపింగ్ వాహనం(ఫైల్)

వనపర్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కార్మికులపై పనిభారం తగ్గించడం, పారిశుధ్యం కోసం ఖర్చు చేస్తున్న నిధులను ఆదా చేయడం కోసం వనపర్తి మునిసిపాలిటీ మూడేళ్ల క్రితం స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆ మిషన్ పనితీరు మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల ఉదాసీన వైఖరి కారణంగా పట్టుమని పది రోజులు కూడా నడవకుండానే మిషన్ పలుమార్లు మరమ్మతులకు గురైంది. మరమ్మతునకు గురైన సందర్భాల్లో మునిసిపాలిటీ అధికారులు, పాలకవర్గంపై పలు విమర్శలు వచ్చాయి. కొత్త మిషన్ కొనుగోలు చేస్తున్నామనే పేరుతో.. పాత మిషన్ కొనుగోలు చేశారని, అందుకే ఎప్పుడూ రిపేర్లకు గురవుతుందని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. వారి ఆరోపణలకు బలం చేకూర్చేలా పలు ఘటనలు కూడా జరిగాయి. అయితే గతేడాది మార్చిలో స్వీపింగ్ మిషన్‌ను పాత మునిసిపాలిటీ వద్ద పార్కింగ్‌లో ఉంచగా.. అగంతకులు నిప్పు పెట్టారు. ఆ సమయంలో కూడా అనేక ఆరోపణలు వచ్చాయి. మిషన్ తగులపడటం యాదృచ్ఛికం కాదని, కొందరు కావాలనే కుట్ర చేశారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. కానీ ఇప్పటివరకు ఎవరు నిప్పు పెట్టారు? ఏ కారణంతో మిషన్ తగలబడిందనే విషయాలను తేల్చకపోవడం గమనార్హం. అప్పుడు.. ముంబై నుంచి టెక్నీషియన్లు వచ్చి చూసి అంచనాలు వేసిన తర్వాత, మరమ్మతు చేసి వినియోగంలోకి తెస్తామని మునిసిపల్ అధికారులు చెప్పారు. కానీ మరో రెండు నెలలు గడిస్తే ఏడాది పూర్తవుతున్నా.. ఇప్పటివరకు ఆ మిషన్‌కు మరమ్మతులు చేయలేదు. మిషన్ కాలిపోయిన తర్వాత ఎన్నికల హడావిడి మొదలు కావడంతో మునిసిపాలిటీపై ఎవరి దృష్టి పడకపోడలేదు. ఎన్నికలు ముగిసి నెల రోజులు పూర్తయినా.. ఇప్పటికీ మిషన్‌ను వినియోగంలోకి తేకపోవడాన్ని చూస్తే మునిసిపాలిటీ పాలకవర్గంతో పాటు అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. గతంలో తాత్కాలికంగా వినియోగించుకున్న భవనాన్ని ఖాళీ చేసి.. మునిసిపాలిటీని సొంత భవనంలోకి మార్చారు. ఆ తర్వాత స్వీపింగ్ మిషన్ పాత ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్ వద్ద ఉంచగా, ప్రస్తుతం దుమ్ము పట్టిపోతోంది. మునిసిపాలిటీని సొంత భవనంలోకి మార్చిన సమయంలో కేవలం వాస్తు కోసమే రూ.లక్షలు ఖర్చు చేసి, మార్పులు చేసిన పాలకవర్గ పెద్దలు.. ప్రజలకు ఉపయోగపడే స్వీపింగ్ మిషన్‌ను మాత్రం ఇప్పటివరకు అందుబాటులోకి తేలేకపోయారు.

ఆది నుంచీ విమర్శలే..

వనపర్తి మేజర్ మునిసిపాలిటీ. సుమారు లక్ష జనాభా ఉన్న మునిసిపాలిటీలో రోజూ పారిశుధ్యం విషయంలో కార్మికులపై పనిభారం కూడా అధికంగానే ఉంటుంది. జనాభాకు తగ్గట్టుగా కొన్నాళ్లుగా కార్మికుల నియామకం కూడా జరగడం లేదు. చెత్త సేకరణకు ఎక్కువ మంది సిబ్బందిని కేటాయించాల్సి వస్తుందనే ఉద్దేశంతో.. చెత్త వసూళ్ల పేరిట ప్రైవేటు వ్యక్తులకు ఆ బాధ్యతలు అప్పగించారు. మిగతా కార్మికులు ప్రధాన రోడ్లు క్లీన్ చేయడం, డ్రైనేజీలను శుభ్రం చేయడం కోసం పని చేస్తున్నారు. అయితే ప్రధాన రోడ్లను ఊడ్చడం కూడా ఇప్పుడు కార్మికులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో అందరి దృష్టి స్వీపింగ్ మిషన్‌పై పడుతోంది. ఆ క్రమంలో 2020 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ద్వారా సర్క్యులర్ 159ని విడుదల చేసి.. టీఎస్ ఆగ్రోస్ ద్వారా మేజర్ మునిసిపాలిటీల్లో స్వీపింగ్ మిషన్లు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో వనపర్తి మునిసిపాలిటీ అధికారులు కొటేషన్/టెండర్ లేకుండా రూ.65 లక్షల వ్యయంతో టాటా కంపెనీ నుంచి సెప్టెంబర్ 17, 2020న స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేశారు. సాధారణంగా ఏ వస్తువు లేదా యంత్రం కొనుగోలు చేసేటప్పుడు మునిసిపాలిటీలో సంబంధిత డీలర్ల నుంచి కొటేషన్‌లు స్వీకరిస్తారు. ఏ డీలర్ తక్కువకు ఆ యంత్రం ఇస్తే వారి నుంచి కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు. లేదా మిషన్ కొనుగోలుకు సంబంధించి టెండర్లను ఆహ్వానించిన తర్వాత తక్కువ కోట్ చేసిన వారికి అప్పగిస్తారు. కానీ ప్రభుత్వమే సర్క్యులర్ జారీ చేయడంతో కొటేషన్/టెండర్ లేకుండానే అధికారులు మిషన్ కొనుగోలు చేశారు. ఇప్పటికి దాదాపు మూడేళ్లు పూర్తయ్యింది. కానీ పట్టుమని పది రోజులు కూడా ఈ మిషన్‌ను ఏకదాటిగా నడపలేదు. రోడ్ల విస్తరణ కూడా మెజారిటీ భాగం పూర్తయ్యింది. గతంలో రోడ్ల విస్తరణను సాకుగా చూపినప్పటికీ.. ఇప్పుడా పరిస్థితి లేదు. ఆ మిషన్‌కు నెలకు రూ.95 వేల నిర్వహణ ఖర్చులను కంపెనీకి చెల్లిస్తే.. కంపెనీ డ్రైవర్, హెల్పర్‌ను కేటాయించడంతోపాటు బ్రష్‌లను సమకూర్చి దాన్ని నిర్వహణ బాధ్యత తీసుకుంటుంది. గతేడాది వరకు ఆ మిషన్ నడిచేందుకు సుమారు రూ.ఆరు లక్షల ఖర్చయిందని అధికారులు చెబుతుండగా.. అంత మొత్తంలో ఖర్చు జరిగే అవకాశం లేదనే విమర్శలు ఉన్నాయి.



మూలన పడ్డ రూ.65 లక్షలకు కొనుగోలు చేసిన వాహనం

కాసుల కక్కుర్తే కారణమా?

స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేసినప్పటి నుంచి ఆ విషయంలో అధికారులు, పాలకవర్గంపై విమర్శలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. కొనుగోలు చేసిన కొద్ది రోజులకే మిషన్ పార్ట్స్ కొన్ని దెబ్బతిన్నాయి. దీంతో పాత మిషన్ కొనుగోలు చేసి.. కొత్త మిషన్ కొనుగోలు చేసినట్లుగా అధికారులు, పాలకవర్గం నిధులు కాజేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే మునిసిపాలిటీ తీర్మానం చేసే సమయాల్లోనూ మిషన్ ధర విషయంలో గందరగోళ పరిస్థితి ఉంది. ఒక మిషన్ కొనుగోలు చేసేందుకు రెండుసార్లు తీర్మానాలు చేశారు. ఒకసారి రూ.45 లక్షలకు తీర్మానం చేయగా.. మరోసారి రూ.20 లక్షలకు తీర్మానం చేశారు. అంటే మిషన్ ధర తెలుసుకోకుండానే తీర్మానాలు చేశారా? మొదటి తీర్మానం చేసేటప్పుడు మిషన్ ధర తెలియదా? లేదా నిధులు కాజేసేందుకు రెండు సార్లు తీర్మానం చేశారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అలాగే కంపెనీకి రెండు విడతలుగా డబ్బులు చెల్లించారు. తీర్మానం రూ.65 లక్షలకు చేసి.. ఒకసారి రూ.40.95 లక్షలు, మరోసారి రూ.18.20 లక్షల చొప్పున రూ.59.15 లక్షలు చెల్లించారు. దీంతోపాటు గతేడాది వరకు నిర్వహణ ఖర్చులు రూ. ఆరు లక్షల వరకు అయినట్లు అధికారులు తెలుపుతున్నారు. కానీ అసలే నడవని మిషన్‌కు అంత మొత్తంలో నిర్వహణ ఖర్చు ఎలా అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు రెండుసార్లు దానికి రిపేర్లు కాగా.. గతేడాది దహనం మూడోసారి మరమ్మతుగా చెప్పవచ్చు. దహనం ఘటన కంటే ఆరు నెలల ముందే నిర్వహణ ఖర్చులు చెల్లించకపోవడంతో మూలన పడేసిన మిషన్‌కు ఎవరు నిప్పు పెట్టారనే విషయం ఇంకా తేలలేదు. బ్యాటరీ పూర్తిగా డౌన్ అయిన మిషన్‌లో షార్ట్‌సర్క్యూట్ అయ్యే అవకాశాలు లేవనే అభిప్రాయం కూడా అప్పట్లో వ్యక్తమైంది. కొత్త ఎమ్మెల్యే ఎన్నిక కావడంతో మునిసిపాలిటీపై దృష్టి పెట్టి.. ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్‌ను వినియోగంలోకి తేవాలని పుర ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బెల్టు తీస్తారా?

- జోగుళాంబ గద్వాల జిల్లాలో విచ్చల విడిగా దుకాణాలు
- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- మామూళ్ల మత్తులో అధికారులు



మానవపాడు మండల కేంద్రంలోని ఓ వ్యక్తి ఇంట్లో దొరికిన మద్యం(ఫైల్)

గద్వాల క్రైం, జనవరి 23: జోగుళాంబ గద్వాల జిల్లా బెల్టు దుకాణాలకు అడ్డాగా మారింది. గ్రామాలు, పట్టణాల్లో ఏడాది పొడవునా.. అర్ధరాత్రి వరకూ ఎక్కడ పడితే అక్కడ మద్యం విచ్చలవిడిగా దొరుకుతోంది. కిరాణ కొట్లు, నివాస గృహాల్లో ఈ దుకాణాలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని చోట్ల తడికలతో షెడ్డులా వేసి, బెల్ట్ దుకాణాన్ని నడుపుతున్నారు. జిల్లా కేంద్రంలో.. ముఖ్యంగా శివారు కాలనీల్లో ఎక్కువగా బెల్ట్ దుకాణాలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గద్వాల మండలంలోని జమ్మిచేడు, వీరాపురం, కాకులారం, పూడూరు, గోన్‌పాడ్, మేలచెర్వు, అనంతపురంతో పాటు పలు గ్రామాల్లో బెల్టు దుకాణాలు కొనసాగుతున్నాయి. అలంపూర్ డివిజన్‌లో మానవపాడు, ఉండవల్లి, పుల్లూరు, కోనేరు, గుందిమల్ల, భీమవరం, క్యాతూరు, కాశీపురం, సింగవరం, గుందిమల్ల, సుల్తానాపురం, అయిజలో వెంకటాపురం, సిందనూరు, పులికల్, భూంపురం, మల్దకల్ మండలం ఎల్కూర్, మల్లెందొడ్డి, బిజ్వారం, రాజోలి, శాంతినగర్, వడ్డేపల్లిలో తదితర గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో బెల్టు దుకాణాలు లేని గ్రామాలు లేవంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఒక్కో గ్రామంలో నాలుగుకు పైగానే బెల్టు దుకాణాలు ఉండగా, మండల కేంద్రాల్లో రెట్టింపు సంఖ్యలో ఈ దుకాణాలు ఉన్నట్లు సమాచారం. ఈ దుకాణాల గురించి పోలీసులకు తెలిసినా వారిచ్చే ముడుపులు తీసుకుని నోరుమెదపడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఎక్సైజ్ అధికారులు ఎక్కడ?

జిల్లాలో ఎటు చూసినా బెల్టు దుకాణాలు కనిపిస్తుండగా.. వాటిని నివారిండంలో అధికారుల పాత్ర కనిపించడం లేదు. దాంతో జిల్లాలో ఎక్సైజ్ అధికారులు ఉన్నట్లా? లేనట్లా? అనే అనుమానాలు అందరిలో వస్తున్నాయి. వారు దుకాణాల జోలికి వెళ్లేందుకు ఎందుకు వెళ్లడం లేదో అర్థం కావడం లేదు. బెల్టు దుకాణాలను నిర్మూలిస్తేనే మద్యం వల్ల జరిగే ప్రమాదాలు ఆగుతాయని గ్రహించాల్సిన అవసరం ఉంది.



మానవపాడు మండల పరిధిలోని ఓ బెల్టు దుకాణంలో ఇటీవల దొరికిన మద్యం(ఫైల్)

పూర్తి స్థాయిలో నిర్మూలిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలిస్తాం. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు 60 కేసులు నమోదు చేయడంతో పాటు 75 మందిని అరెస్టు చేశాం. రూ.10 లక్షల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటాం.

– సైదులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, జోగుళాంబ గద్వాల

అధిక ధరలకు విక్రయం

బెల్టు దుకాణాల్లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వైన్ షాపుల్లో ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తుండగా.. ఇక్కడ మాత్రం ఒక్కో బాటిల్‌పై ఒక్కో విధంగా డబ్బులు అదనంగా వసూలు చేస్తున్నారు. క్వార్టర్‌పై రూ.50 కిపైగా, బీరుపై రు.20 దాకా అధికంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. బెల్టు దుకాణాల వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది.



ఆ ప్రమాదానికి బెల్టు దుకాణ యజమానీ ఒక కారణమా?

గద్వాల పట్టణంలోని జమ్మిచేడు సమీపంలో ఇటీవల రోడ్డు డివైడర్‌ను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆ ఘటన జరిగింది అర్ధరాత్రి దాటిన తర్వాత. పార్టీ ముగిసిన తర్వాత కూడా ఇంకా మద్యం కావాలని గద్వాల సమీపంలోని ఓ గ్రామంలో గల బెల్ట్ దుకాణం యజమానికి ఫోన్ చేశారని, త్వరగా వస్తే ఇస్తానని అతను చెప్పాడని సమాచారం. దాంతో అప్పటికే పార్టీలో మద్యం సేవించిన వారు అతివేగంగా కారును నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. ఒకవైపు బెల్టు దుకాణాల్లో అర్ధరాత్రి దాకా మద్యం విక్రయాలు జరుగుతుండగా, అధికారులు మాత్రం జిల్లాలో బెల్టు దుకాణాలు లేవని చెప్పడం గమనార్హం. గద్వాల పట్టణంతో పాటు గద్వాల పట్టణ సమీప గ్రామాల్లోని కొందరిపై ఇప్పటికే మద్యం విక్రయ కేసులు నమోదైనా.. మళ్లీ దుకాణాలు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ఈ విషయంలోనూ అధికారుల పాత్ర ఉందా? అన్నది తేలాల్సి ఉంది.

కష్టపడితే విజయం మనదే

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్/దేవరకద్ర, జనవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గ్రామాల్లో ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేస్తే లోక్‌సభ ఎన్నికల్లో విజయం మనదేనని మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నియోకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తలు, ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను లోక్ సభకు పోటీ చేయాలని అనుకుంటున్నట్లు తెలిపారు. పార్టీని నమ్ముకున్న ప్రతీ కార్యకర్తకు మంచి రోజులు వస్తాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతీ నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లా.. లోక్‌సభ ఎన్నికల్లో కూడా కార్యకర్తలు, నాయకులు కష్టపడి పని చేస్తే.. ఎంపీ స్థానం గెలుచుకుంటామన్నారు. మహబుబ్‌నగర్ ఎంపీ స్థానాన్ని గెలిపించి, సీఎంకు అందించాలన్నారు. దాంతో పాలమూరు జిల్లాను మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక గత పదేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ విద్వేషాన్ని పెంచి పోషించి, మతం పేరుతో రాజకీయం చేశారన్నారు. దేశప్రయోజనాలను, పేదల హక్కులను కాపాడలేదని ఆరోపించారు. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర ద్వారా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించి దేశంలో శాంతి దుకాణం తెరిచారని కొనియాడారు. భారత్ జోడోయాత్ర తర్వాత దేశంలో కాంగ్రెస్‌కు, రాహుల్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నదనడానికి కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీల ఎన్నికలే నిదర్శనమని, రాహుల్ స్ఫూర్తితో కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పోరాడటం వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త ఇదే స్ఫూర్తితో పనిచేసి పార్టీని గెలిపించాలన్నారు. మనందరం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడానికి పని చేయాలన్నారు. ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ తన గెలుపుకోసం ఎంతో కృషి చేసిన ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడే బాధ్యత తనదన్నారు. కార్యక్రమంలో మహబుబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ రెడ్డి, మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల రాస్తారోకో

- వేళకు బస్సులు నడపాలని డిమాండ్
- ఖిల్లాఘణపురంలో ఆందోళన



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

ఖిల్లాఘణపురం, జనవరి 23: వేళకు బస్సులు నడుపడటం లేదని వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో దొంతికుంట తండా మోడల్ స్కూల్ విద్యార్థులు మంగళవారం రాస్తారోకో చేశారు. బస్టాండ్ ముందు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. మోడల్ స్కూల్‌లో విద్యను అభ్యసించడానికి రోజూ వందలాది మంది విద్యార్థులు మండల కేంద్రం బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తారు. మండలంలోని గ్రామాల నుంచి మోడల్ స్కూల్‌కు వెళ్లడానికి బస్సులు సమయపాలన పాటించకపోవడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాలకు వెళ్లేందుకు ఖిల్లా ఘణపురం బస్టాండ్‌కు వందలాది మంది విద్యార్థులు వచ్చారు. బస్సులు ఆలస్యంగా వచ్చాయి. ఒక బస్సులో విద్యార్థులు నిండటంతో మరికొందరు టాప్‌పైన ఎక్కారు. దాంతో డ్రైవర్ బస్సును ఆపేసి, విద్యార్థులను కిందికి దించారు. తామెలా స్కూల్‌కు వెళ్లాలని దాదాపు వంద మంది విద్యార్థులు బస్సు ముందు బైఠాయించారు. స్కూల్‌కు వెళ్లేందుకు ప్రత్యేకంగా బస్సులు నడపాలని, సమయపాలన పాటించాలని నినదించారు. పోలీసులు జోక్యం చేసుకుని విద్యార్థులను సముదాయించారు. డిపో మేనేజర్‌తో మాట్లాడుతామని చెప్పారు. తర్వాత వెంట వెంటనే రెండు బస్సులు రావడంతో అందులో పాఠశాలకు వెళ్లారు. ఉదయం వేళ విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడంతో పాటు ఉద్యోగులు విధులకు వెళ్తుండటంతో బస్సులు సమయానికి రాక, ఉన్నవి చాలక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల్లో నిల్చోడానికి కూడా సమయం చాలడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం ఈ పరిస్థితి నెలకొంటోందని అంటున్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు పాఠశాల వేళల్లో ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచాలని, వేళకు నడపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



వేళకు బస్సులు రాకపోవడంతో వచ్చిన ఒక్క బస్సు టాపుపై ఎక్కి, వెనకాల వేలాడుతున్న విద్యార్థులు

సీసీ కెమెరాల బిగింపు



అడవిలో కెమెరాలు బిగిస్తున్న అటవీ అధికారులు

మన్ననూర్, జనవరి 23 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం(ఏటీఆర్)లో నాలుగవ ఫేజ్ టైగర్ మానిటరింగ్ సిస్టమ్‌లో భాగంగా సీసీ ట్రాప్ కెమెరాల బిగింపును మంగళవారం అటవీ అధికారులు ప్రారంభించారు. మొదటగా మద్దిమడుగు రేంజ్ పరిధిలో రేంజ్ అధికారి ఆదిత్య, సెక్షన్ అధికారి ముజీబ్‌గోరిల నేతృత్వంలో 174 కెమెరాలను బిగించారు. నెలరోజుల పాటు ఈ సీసీ ట్రాప్ కెమెరాల ద్వారా పెద్ద పులులు, చిరుత పులుల సంచారాన్ని పసిగట్టనున్నాయి. నెలరోజుల అనంతరం ఇవే కెమెరాలను తొలగించి మళ్లీ వేరే రేంజ్‌లో బిగించనున్నట్లు అధికారులు తెలిపారు. సమీప గ్రామాల ప్రజలెవరూ అడవిలోకి వెళ్లకుండా అటవీశాఖ నిషేధం విధించింది. అనుమతులు లేకుండా అడవిలో సంచరించే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు హెచ్చరిస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వలలో చుట్టుకొని వ్యక్తి మృతి

జడ్చర్ల, జనవరి 23 : చేపల వేటకు వెళ్లి వలకు చుట్టుకుని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఆల్వాన్‌పల్లి గ్రామ శివారులోని దుందుభి నదిలో చోటు చేసుకుంది. జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్వాన్‌పల్లి గ్రామానికి చెందిన దగ్గుల కృష్ణయ్య(45) ఈనెల 21న సాయంత్రం దుందుభి నదిలో చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వల తీసుకుని వెళ్లాడు. ఈనెల 22న ఉదయం ఒడ్డున కృష్ణయ్యకు సంబంధించిన దుస్తులు గుర్తించి, నీటిలో వెతకగా కాళ్లకు వల చుట్టుకుని ఉంది. వెంటనే నీటిలో నుంచి బయటికి తీసి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. కృష్ణయ్య సోదరి పెద్దింటి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

విద్యార్థినిని అపహరించిన పాఠశాల వాచ్‌మన్

▸▸ కేసు నమోదు, నిందితుడి రిమాండ్

కొల్లాపూర్, జనవరి 23 : పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన ఓ వాచ్‌మన్ తానే ఓ మైనర్ విద్యార్థినితో ప్రేమాయణం నడిపిన అపహరించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని అదే పాఠశాలలో వాచ్‌మన్‌గా పని చేస్తున్న వ్యక్తి నిరంజన్(39) కొన్ని నెలలుగా ప్రేమ పేరుతో వేధించి వశపరచుకున్నాడు. ఇటీవల సంక్రాంతి సెలవుల్లో మాయమాటలు చెప్పిన నిరంజన్ సొంత ఊరికి వెళ్లాల్సిన విద్యార్థినిని అపహరించాడు. సంక్రాంతి సెలవులు ఇచ్చినా తమ బిడ్డ ఇంటికి చేరుకోకపోవడంతో బాధిత తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి విచారించారు. విషయం తెలిసి వాచ్‌మన్ నిరంజన్ తమ కూతురిని అపహరించుకుపోయాడని బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహించి నిందితుడు నిరంజన్‌ను గుర్తించి ఈనెల 17న రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు చెప్పారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో మంగళవారం ఎంపీపీ భోజ్యానాయక్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. పాఠశాలలో భద్రతా చర్యలు చేపట్టాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఎంపీపీ ఆదేశించారు.

బస్సు, బైక్ ఢీ.. ఒకరి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 23 : ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బిజినేపల్లి మండలం లింగసానిపల్లి గ్రామానికి చెందిన తిరుమలేష్(28) తన భార్య లక్ష్మితో కలిసి నాగర్‌కర్నూల్ పట్టణంలో తన కార్యకలాపాలు ముగించుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో హైదరాబాదు-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మెడికల్ కళాశాల సమీపంలో వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో తిరుమలేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండడంతో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో ప్రథమచికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీ గదిలో ఉంచారు.

నకిలీ 'పోచంపల్లి'!

పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు

భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు

200 ప్రింటింగ్ చీరలు సీజ్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకేఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరికొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐపీ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

- అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం
- మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ తరఫున 19 మంది; బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్టు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్లు తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు
- ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాల్టీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్‌లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఆంథోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాల్టీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాల్టీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాల్టీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాల్టీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే 'అసెంబ్లీ సమీక్షలు'

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం

గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్

పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తర ఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకో ర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్టు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

- ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?
- రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ
- నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు
- మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ
- నిజామాబాద్‌లో దిల్ రాజు?
- వరంగల్‌లో అద్దంకి దయాకర్?



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరోవైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్న ట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.

రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి

తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు

తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడిడిపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.

పరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకలు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 23 : ఈ సంవత్సరం గణతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్‌మైదానంలో నిర్వహించేందుకు అవసరమైన అన్నీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జి.రవినాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సమావేశపు మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోజు ఉదయం తొమ్మిదిగంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని, అంతవరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలలో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని సూచించారు. అన్ని గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాలలో జాతీయ పతాకం ఎగుర వేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎప్పటిలాగే ఈ సంవత్సర సైతం ముఖ్య అతిథి సందేశం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాల బహూకరణ ఉంటుందని, అలాగే ఆయా శాఖల ద్వారా అభివృద్ధిని తెలిపే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, డీఆర్వో కె వివి రవికుమార్, జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలి

- కౌకుంట్ల, పేరూరు పాఠశాలలను పరిశీలించిన డీఈవో రవీందర్



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఈవో

దేవరకద్ర/ చిన్నచింతకుంట, జనవరి 23 : అప్పంపల్లి ఉన్నత పాఠశాలకు జిల్లా స్థాయిలోనే మంచి గుర్తింపు ఉందని, దీన్ని విద్యార్థులు ఇలాగే కాపాడుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఏ.రవీందర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కౌకుంట్ల, అప్పంపల్లి, పేరూరు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని, చదివిన దాన్ని గుర్తించుకుని, వార్షిక పరీక్షల్లో మంచి ప్రతిభ కనపరచాలని తెలిపారు. పరీక్షలపై పట్టు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్‌ను రూపొందించుకుని, పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పదో తరగతి ఉత్తీర్ణతా శాతం పెంపొందించేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపా రు. డీఈవో వెంట సీఎంవో బాలుయాదవ్ ఉన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిశంకర్, కౌకుంట్ల ప్రధానోపాధ్యాయులు సుమన్ రాజ్ పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

- 29న పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నిక

హన్వాడ, జనవరి 23 : ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు మంచి విద్యను అందించాలని ఎంఈవో రాజునాయక్ కోరారు. మంగళవారం పెద్దదర్పల్లి, టంకర పాఠశాలలను పరిశీలించారు. ప్రార్థన సమయంలో పెద్దదర్పల్లి పాఠశాలను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అదేవిధంగా టంకర జడ్పీహెచ్ పాఠశాలలో జరుగుతున్న భోజనశాల, మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన నాణ్యతతో నిర్మాణం చేయాలని కోరారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే డిజిటల్ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 29న పాఠశాల యాజమాన్య కమిటీల ఎంపికను నిర్వహించాలని తెలిపారు. ఆయన వెంట సీఆర్పీ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలి

- ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య

హన్వాడ, జనవరి 23 : తెలంగాణలో మాదిగలు 60 లక్షల మంది ఉన్నారని, రెండు రాజ్యసభ స్థానాలు, రెండు మంత్రి పదవులు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హన్వాడలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే మాదిగల విజ్ఞాన సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. గత ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకాన్ని కొనసాగించాలన్నారు. లేకుంటే ధర్నా, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. జనాభా పరంగా ఎక్కువగా ఉన్న మాదిగలకు పదవులలో వెనుకబడిపోయామని, మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశాన్ని రాష్ట్ర నాయకుడు పాపయ్య పిలుపు మేరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదయ్య, మండల అధ్యక్షుడు రావుల శ్రీను, నాయకులు రాజు, హనుమంతు, కిష్టయ్య, కృష్ణ, జయన్న, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మట్టిని తొలగించాలని వినతి

జడ్చర్ల, జనవరి 23 : జడ్చర్ల మునిసిపాలిటీలోని ఇందిరమ్మ చౌరస్తాలో రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించాలంటూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, నాయకులు బాగి కృష్ణయ్య మంగళవారం మునిసిపల్ కమిషనర్ మహమూద్‌షేక్‌కు వినతిపత్రం అందజేశారు. జాతీయరహదారి పనులలో భాగంగా నిర్మిస్తున్న రోడ్డు పనులలో మట్టిని తవ్వి, రోడ్డు పక్కన కుప్పగా పోశారని, ప్రతి నిత్యం వందలాది వాహనాలు అటువైపుగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. రోడ్డుపై ఉన్న మట్టి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణనష్టం జరుగకుండా ముందస్తుగా మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలంటూ కోరారు.

గ్రామ పంచాయతీ కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

రాజాపూర్, జనవరి 23 : మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం దగ్గర మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం క్యాలెండర్‌ను ఎంపీడీవో లక్ష్మీదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఎంపీవో వెంకట్‌రాములు, అంజనేయులు, నర్సింములు, రాములు, షబ్బీర్, రఘు, యాదగిరి, మల్లేష్ పాల్గొన్నారు.

తుంకినీపూర్ గుట్టలో

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



బోయ రాజు మృతిచెందిన తుంకినీపూర్ గుట్ట దగ్గర విచారణ చేస్తున్న పోలీసులు

అడ్డాకుల, జనవరి 23 : మండలం తుంకినీపూర్ గ్రా మ గుట్టలో ఓ యువకుడు అను మానాస్పదంగా మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివా సులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌకుంట్ల మండలం ఇస్రంపల్లి గ్రామానికి చెందిన బోయ రాజు (34) ఇదే మండలంలోని తుంకినీపూర్ గ్రామానికి చెందిన అక్క కూతురు స్వాతిని పెళ్లి చేసుకొని ఇక్కడనే ఉంటూ వేముల గ్రామానికి చెందిన ఓ వ్యవసాయ పొలంలో పని చేస్తూ జీవిస్తున్నాడు. సంక్రాంతి కోసమని పండుగకు మూడురోజుల ముందు ఇస్రంపల్లికి బయలుదేరాడు. స్వగ్రామంలో పండుగ ముగించుకొని తుంకినీపూర్ వెళ్తానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. నాటి నుంచి రాజు అదృశ్యమయ్యాడు. ఆచూకీ కోసం వెతికినా జాడ కానరాలేదు. మంగళవారం తుంకినీపూర్ గ్రామ శివారులో గల గుట్టలో ఉపాధి కూలీలకు ఓ మృతదేహం కన్పించింది. పోలీసులు, గ్రామస్థులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా రాజు మృతదేహంగా అతడి బావ అయిన కావలి నర్సిములు గుర్తు పట్టాడు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఘటనా స్థలంలోనే పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. రాజు మృతి అనుమానాస్పదమా లేక ఆత్మహత్యనా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి భార్య స్వాతితో పాటు, పల్లవి, మీనాక్షి అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కయిన బోయ రాజు మృతి తో ఆ కుటుంబం వీధిన పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని తుంకినీపూర్ గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు.

వాంతులు, విరేచనాలతో గొర్రెల కాపరి

నవాబ్‌పేట, జనవరి 23 : వాంతులు, విరేచనాలతో ఓ గొర్రెలకాపరి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కారుకొండ గ్రామానికి చెందిన కుర్మయ్య(48) తన గొర్రెలను కొన్ని రోజుల క్రితం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సమీపంలో మేపుతుండగా రెండు రోజుల నుంచి వాంతులు, విరేచనాలకు గురయ్యాడు. అనారోగ్యానికి గురికావడంతో గ్రామంలో తన కొడుకుకు విషయం చెప్పాడు. దీంతో కొడుకు అక్కడకు వెళ్లి తండ్రి కుర్మయ్యను బైక్‌పై గ్రామానికి తీసుకొస్తుండగా నవాబ్‌పేట మండలం గురుకుంట సమీపంలోకి రాగానె మృతి చెందాడు. స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసపత్రిలో చూయించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుర్మయ్య విషయం తెలుసుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

ఈఎస్ఎంఎస్ పద్ధతి ద్వారా ఎన్నికలను

పకడ్బందీగా నిర్వహించాలి

- వీసీలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పంకజ్, సంతోష్



వీసీకి హాజరైన కలెక్టర్ జి. రవినాయక్‌తో పాటు అదనపు కలెక్టర్లు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 23 : ఎన్నికల సీజర్ మానిటరింగ్ సిస్టం (ఇఎస్ఎంఎస్) పద్ధతి ద్వారా ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పంకజ్, సంతోష్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో డబ్బు, మద్యం పంపిణీ, పట్టుకున్న నగదు, మద్యం వివరాల ఇఎస్ఎంఎస్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సిఉంటుందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా సీజ్ చేసే నగదు, మద్యం వివరాలను ఈఎస్ఎంఎస్ పోర్టల్‌లో మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయవచ్చని తెలిపారు. 'డేటా నిర్వహణ, జిల్లా ఎన్నికల అధికారులు, రాష్ట్ర సీఈవోలు, జిల్లా, రాష్ట్ర స్థాయి నోడల్ అధికారుల పాత్ర, తదితర అంశాలపై' తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల సీఈవోలు, జిల్లా ఎన్నికల అధికారులతో వీరు మంగళవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సందర్భంలో పట్టుకొనే నగదు, మద్యానికి సంబంధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో 25 ఏజెన్సీలను గుర్తించామని, ఇందులో భాగంగా అనుసరించాల్సిన పద్ధతులు, ఎఫ్ఎస్‌టీ బృందాలు, వ్యయనిర్వహణ కమిటీలు యాప్ ద్వారా డేటా నమోదు, జిల్లా ఎన్నికల అధికారుల బాధ్యతలు, అదే సమయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారుల బాధ్యతలు తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా గత ఎన్నికలలో రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను 1,38,000 మంది వినియోగించారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన అనంతరం ఈ యాప్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకు రానున్నట్లు వారు వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ జి. రవినాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, అసెంబ్లీ ఎన్నికల వ్యయ నిర్వహణ నోడల్ అధికారులుగా పనిచేసిన డీసీవో సుధాకర్, జిల్లా ఆడిట్ అధికారి శ్యాంసుందర్, జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి సత్యనారాయణ మూర్తి, ఎఫ్ఎస్‌టీ బృందాల అధిపతులు ఈ వీసీకి హాజరయ్యారు.

అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్) : ఓటరు జాబితా సవరణకై వచ్చిన అభ్యంతరాలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రవినాయక్ అన్నారు. మంగళవారం ఆయన ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన అభ్యంతరాలు, కొత్త ఓటరు నమోదు, తదితర అంశాలపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం ఒక్కరోజే జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 7892 అభ్యంతరాలను పరిష్కరించడం పట్ల ఆయన ఈఆర్వోలను, ఏఈఆర్వోలను అభినందించారు. జాప్యం లేకుండా ఎప్పటికప్పుడే అభ్యంతరాలు పరిష్కరించాలని ఆయన పునరుద్ఘాటించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మహబూబ్‌నగర్ ఈఆర్వో శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్, జడ్చర్ల ఈఆర్వో ఎస్.మోహన్‌రావు, దేవరకద్ర ఈఆర్వో, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, కలెక్టర్ కార్యాలయ ఎన్నికల విభాగం అధిపతి అఖిలప్రసన్న హాజరయ్యారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లపై విచారణ : కలెక్టర్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్) : డబుల్ బెడ్‌రూం ఇళ్లపై అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో లబ్ధిదారుల అర్హత నిర్ధారణకు గాను విచారణను ప్రారంభించినట్లు కలెక్టర్ జి. రవినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను రెవెన్యూ గృహనిర్మాణ శాఖల సిబ్బంది 18 మందితో బృందాలను ఏర్పాటు చేశామని, వారం రోజుల్లో ఈ బృందాలు వారి విచారణను పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర పట్టణ ప్రాంతాలలో బృందాలు విచారణను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 40 (పార్టీ) కాలమ్స్ ప్రొఫార్మాను రూపొందించి పూర్తి వివరాలను సేకరిస్తారని, ఈ బృందాలు రెండు పడకల గదుల ఇండ్లన్నింటినీ తిరిగి పూర్తిగా విచారించి లబ్ధిదారుల అర్హతను గుర్తించి నిర్ధారించడం జరుగుతుందని ఆయన తెలిపారు. విచారణ ప్రక్రియ కొనసాగుతుందని, వారం రోజుల్లో ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పిల్లలకు నులిపురుగుల మాత్రలు వేయించాలి

- వచ్చేనెల 12న జాతీయ నులిపురుగుల దినోత్సవం

- పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, డీఎంహెచ్‌వో

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 23 : పిల్లల్లో నులి పురుగులను నివారించేందుకు ఫిబ్రవరి 12న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రవినాయక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు నులి పురుగులు ఉంటే రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, కడుపు నొప్పి వంటి వాటితో బాధపడతారని తెలిపారు. అందుకుగాను పిల్లలందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఆయన కోరారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు మాత్రలు వేయించా లని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలు మాత్రలను ఇంటికి తీసుక వెళ్లేందుకు అనుమతించ వద్దని సూచించారు. ఏదేని కారణం చేత ఫిబ్రవరి 12న మాత్రలు వేయని వారికి ఫిబ్రవరి 19న మాప్ ఆప్ కార్యక్రమం నిర్వహించి వేస్తారని తెలిపారు. జిల్లాలో 19 సంవత్సరాలలోపు పిల్లలు 2,45,789 మంది ఉన్నారని, జిల్లాలో 2 లక్షల 88 వేల మాత్రలు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. ముఖ్యంగా జిల్లా సంక్షేమ అధికారి, విద్యాశాఖ అధికారి, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఈ విషయంపై సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సర్వేలెన్స్ మెడికల్ అధికారి డాక్టర్ అజార్, కార్యక్రమం వివరాలను వివరించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, డీఐవో డాక్టర్ శంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు పాల్గొన్నారు.

నూతన సిలబస్‌పై పట్టు సాధించాలి

» పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీకాంత్ రాథోడ్

పాలమూరు యూనివర్సిటీ, జన వరి 23 : యూనివర్సిటీ పరిధిలోని బీఎడ్ కోర్సుల్లో మారిన సిలబస్‌పై ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పూర్తి పట్టు సాధించాలని తద్వారా కొత్త సిలబస్ బోధనలో ఇబ్బందుల్లేకుండా ఉంటుందని పీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు. యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మంగళవారం యూనివర్సిటీ ఆడిటోరియంలో బీఎడ్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు మారిన సిలబస్‌పై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను వినియోగించుకోవాలన్నారు. సమాజంలో వస్తున్న మార్పులు, భవిష్యత్‌తరాలకు ఏవిధమైన విద్యనందిస్తే ఉపయుక్తంగా ఉంటుందో దానికనుగుణంగానే బీఎడ్ కోర్సుల్లోనూ సిలబస్ మారిందని, మూస విధానాలకు స్వస్తి చెప్పి నూతనంగా ఏర్పాటుచేసిన సిలబస్ బీఎడ్ విద్యార్థులకు పూర్తిగా అవగతమవడానికి అధ్యాపకులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గిరిజామంగతాయారు, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్, హెచ్‌వోడీ డాక్టర్ విశ్వనాథ్, ప్రొఫెసర్లు రామకృష్ణ, మృణాళిని, శంకర్, సునీత, లలిత, సరస్వతి పాల్గొన్నారు.

31న రైస్, ఆయిల్ మిల్స్ వర్కర్స్ జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సి.వెంకటేష్

పాలమూరు, జనవరి 23 : రైస్, ఆయిల్‌మిల్స్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం)జిల్లా ఐదో మహాసభలను ఈనెల 31వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు సి.వెంకటేష్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం 1994లో ఆపరేటర్స్ మేస్త్రీలతో ప్రారంభమైందన్నారు. పారాబాయిల్డ్ ఆయిల్‌మిల్, డిగార్టిగేటర్స్‌లో పనిచేస్తున్న మేస్త్రీ, ఆపరేటర్స్, హమాలీ, దినసరి మహిళ, గు మాస్తాల సమస్యల పరిష్కారానికి సంఘం పోరాడుతోందన్నారు. సంఘం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్మికులను ఐక్యం చేస్తోందన్నారు. డీజిల్, పెట్రోల్ ధరల పెంపుతో నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నా కారికుల వేతనాలు నేటికీ పెంచకపోవడం దారుణమన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా నేటికీ అమలుకు నోచుకోవటం లేదన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు ఎం.నరసింహులు, పి.దాసు, చిన్నయ్య ఆర్.శేఖర్, ఎం.సతీష్, ఎస్.ఆంజనేయులు, యు.కృష్ణ, నారాయణ, బుజ్జి పాల్గొన్నారు.

నేతాజీ పోరాటం నేటి యువతకు ఆదర్శం కావాలి

- నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిలో వక్తలు



జడ్చర్లలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నేతాజీ యువజన సంఘం సభ్యులు, నాయకులు, విద్యార్థులు

జడ్చర్ల, జనవరి 23 : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం, పోరాటం నేటి యువతకు ఆదర్శం కావాలని తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్ అన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని నేతాజీ చౌరస్తాలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నేతాజీ 127వ జయంతిలో పాల్గొని మాట్లాడారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో కీలకంగా వ్యవహరించాడని, ఆజాద్ హింద్‌ఫౌజ్‌ను ఏర్పాటు చేసి పౌరులను ఉద్యమంలోకి తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. యువజన సంఘం అధ్యక్షుడు జీవన్ గుండప్ప, కార్యదర్శి బాద్మి రవిశంకర్‌లు ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మునిసిపల్ కౌన్సిలర్లు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

● జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు, కళాశాల నుంచి నేతాజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఆవరణలో నేతాజీ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మునిసిపాలిటీలోని కావేరమ్మపేట చౌరస్తాలో నేతాజీ విగ్రహానికి గణేష్‌యూత్ సేన ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో గోనెల నరేందర్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాలు అమలు చేద్దాం : సీనియర్ సిటిజన్ ఫోరం

నవాబ్‌పేట : భారత స్వాతంత్రోద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సభాష్ చంద్రబోస్ ఆశయాలు అమలు చేయాల్సిన బాధ్యత యువతపై ఉందని సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు చిగుళ్లపల్లి నర్సింహులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నేతాజీ జయంతి సందర్భంగా ఫోరం సభ్యులతో కలిసి ఆయన చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు విజయ్‌కుమార్, శేఖర్, వెంకటేశ్వరప్ప, శివస్వామి, వేణునాదం, పండరీనాథ్ పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

రాజాపూర్ : మండల కేంద్రంలోని పాఠశాలలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నేతాజీ శుభాష్‌చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతీ యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బాలరాజు, రాఘవేందర్, ప్రవీణ్, పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్తీ నుంచి ప్రజలను కాపాడాలి

- క్యాప్స్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆకెపోగు ఆడమ్స్ డిమాండ్



మాట్లాడుతున్న క్యాప్స్ అధ్యక్షుడు ఆడమ్స్

మహబూబ్‌నగర్, జనవరి 23 : ప్రజలను కల్తీ బారీ నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కన్స్యూమర్ అవేర్‌నెస్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ(క్యాప్స్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆక్యపోగు ఆడమ్స్ డిమాండ్ చేశారు. మంగళవారం క్యాప్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కల్తీ బారిన పడకుండా ఉండేందుకు గాను డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, జిల్లా లీగల్ మెట్రాలజీ, జిల్లా కమర్షియల్ టాక్స్ జిల్లా అగ్రికల్చర్ అధికారులకు ప్రభుత్వం కఠిన చట్టాలను ఇచ్చిందని, అయితే ఆయా శాఖల్లో సరైన సిబ్బంది లేకపోవడం, పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకపోవడం వల్ల కల్తీ వ్యాపారం నానాటికీ పెరిగిపోతోందన్నారు. వెంటనే ప్రభుత్వం ఆయా శాఖలకు సిబ్బంది, అధికారులను కేటాయించి ప్రజలను కల్తీ బారి నుంచి కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ఆయా శాఖలకు పోలీస్‌శాఖ మద్దతు లేకపోవడం వల్ల పూర్తి స్థాయిలో తనిఖీలు చేయలేకపోతున్నారని, ఇప్పటికైనా పోలీస్‌శాఖ మద్దతుగా నిలిచేలా ఆదేశాలివ్వాలని కోరారు. చట్టాలున్నా భయం లేకపోవడం వల్ల మోసాలకు పాల్పడే వ్యాపారులు అదేపనిగా మోసాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాప్స్ ప్రధాన కార్యదర్శి శేరి వెంకటరెడ్డి, ముస్తఫా, చంద్రశేఖర్, విజయ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్‌కు అభినందనలు



మహేష్ గౌడ్‌తో మహేక్ సోదరులు

నవాబ్‌పేట, జనవరి 23 : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లు రవిని పీసీసీ సేవాదళ్ ఉపాధ్యక్షులు వాజిద్ మహేక్, రాష్ట్ర కార్యదర్శి హమీద్ మహేక్‌లు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు నమ్మిన కార్యకర్తలకు అండగా ఉంటుందని రాబోయే ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని మల్లురవి సూచించినట్లు తెలిపారు.

నేడు కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

మహబూబ్‌నగర్, జనవరి 23 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నామని డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఏనుగొండ జేజేఆర్ గార్డెన్‌లో డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల, మక్తల్, నారాయణపేట ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, చిట్టెం పర్ణికలు హాజరవుతున్నారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలను సిద్ధం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ సమావేశానికి నియోజకవర్గ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ సమస్యలపై కంట్రోల్‌రూంకు సమాచారమివ్వాలి

పాలమూరు, జనవరి 23 : మహబూబ్‌నగర్ డివిజనల్ పరిధిలో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా డివిజనల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంకు తెలపాలని డీ.ఈ సి.హెచ్ శివరామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు హన్వాడ, కోయిలకొండ, గండీడ్, మహ్మదాబాద్, దేవరకద్ర, చిన్నచింతకుంట, కౌకుంట్ల మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సమస్యలు తమకు తెలపాలని వివరించారు. పూర్తి వివరాలకు 08542-293096, 08542-293025కు తెలపాలన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు

నవాబ్‌పేట, జనవరి 23 : మండలంలోని కొల్లూర్, కేశవరావుపల్లి గ్రామాల్లో పాలమూరు యూనివర్సిటీ యూనిట్ 5, 8 బృందాలు గ్రామంలో గత ఐదు రోజులుగా వివిధ పద్ధతుల్లో కార్యక్రమాలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం వీధులు శుభ్రం చేసి గ్రామస్థులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రోగ్రాం ఇన్‌చార్జీలు డాక్టర్. శివకుమార్ సింగ్, డాక్టర్ జ్ఞానేశ్వర్‌ల ఆధ్వర్యంలో శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా 100 వలంటీర్స్ రెండు గ్రామాల్లో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్స్, పీఓలు సదరు గ్రామాలలో పరిశుభ్రత, అలాగే ఉన్నతవిద్య అవసరం, యువత స్వయం ఉపాధిపై గ్రామస్థులకు వివరించారు. సర్పంచ్‌లు సౌజన్య, నందీశ్వర స్వామి, రఘు పాల్గొన్నారు.

లింభ్య కమిటీ సరికాదు

- కాంగ్రెస్ నాయకుడు నీల్య నాయక్

నవాబ్‌పేట, జనవరి 23 : మండలంలోని మెట్టుగడ్డ తండాకు చెందిన లింభ్య నాయక్ సంత్ శ్రీ సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా పత్రికల్లో రావడం ముమ్మాటికీ తప్పని, ఆ కమిటీని గిరిజనులు ఎవరూ అంగీకరించడం లేదని కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం జిల్లా వైస్ చైర్మన్ నీల్యా నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన కమిటీని ఈ ఆదివారం సమావేశమై చర్చిద్దామని నిర్ణయించగా కొందరు కమిటీ వేసినట్లు ప్రకటించడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు తారాసింగ్, భాస్కర్ నాయక్,శంకర్ నాయక్, గోపిచంద్‌నాయక్, సేవ్యా నాయక్, కోట్యానాయక్, రమేష్, గోవింద్ పాల్గొన్నారు.

పోలీసు కళాజాత ఆధ్వర్యంలో అవగాహన

నవాబ్‌పేట, జనవరి 23 : మండలం కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం ఎస్పీ హర్షవర్ధన్ సూచన మేరకు జిల్లా పోలీసు కళాజాత ఆధ్వర్యంలో కేజీబీవి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ఆనంద్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చదువు పై దృష్టి పెట్టి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే తమకు సమాచారం ఇవ్వాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు 1098, అకౌంట్లో డబ్బులుపోతే 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వెంకటయ్య మహేష్ తదితరులు పాల్గొన్నారు.